క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 28న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. సమ్మయ్యనగర్, కుడా కాలనీ, శంకర్ నగర్, ఆదర్శ నగర్ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. మహంకాళి టెంపుల్, రంగశాయిపేట, కుమ్మరివాడ, ప్రభుత్వ దవాఖాన ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

సీసీ కెమెరాలతో భద్రత

మామునూరు: సీసీ కెమెరాల ఏర్పాటుతో భద్రత లభిస్తుందని, ప్రతిఒక్కరూ వ్యక్తిగతంగా తమ ఇల్లు, దుకాణం, వాణిజ్య సముదాయాల్లో కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు సూచించారు. ఈ మేరకు వరంగల్ ఆర్టీఏ జంక్షన్ టీచర్స్ కాలనీలో ఎమ్మెల్యే ఆర్థిక సహాయంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఏసీపీ వెంకటేష్, ఇన్‌స్పెక్టర్ రమేష్, కార్పొరేటర్ అరుణతో కలిసి ఎమ్మెల్యే నాగరాజు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ సీసీ కెమెరాలతో నేరస్తులను త్వరగా పట్టుకోవచ్చని అన్నారు. కార్యక్రమంలో కర్నె రవీందర్, చింత ప్రకాశ్, ఇనుగాల జోగిరెడ్డి, టీచర్స్ కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎంసీపీఐ(యూ) కార్యవర్గం ఎన్నిక

ఖిలా వరంగల్: ఎంసీపీఐ(యూ) వరంగల్ నగర కార్యదర్శిగా మాలోతు సాగర్, సహాయ కార్యదర్శిగా మంచు జగదీశ్వర్ నియమితులయ్యారు. ఈ మేరకు వారికి జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ నియామక పత్రాలను ఆదివారం అందజేశారు.

కాంగ్రెస్ నేతలకు సన్మానం



హన్మకొండ: బీసీ సంక్షేమ సంఘం హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి తెళ్ల సుగుణతో పాటు నాయకులు పీసీసీ ప్రధాన కార్యదర్శి ఈవీశ్రీనివాస్‌రావును సన్మానించారు. హనుమకొండ ఇందిరానగర్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో పార్టీ 59వ డివిజన్ ఇన్‌చార్జ్ కేతిడి దీపక్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు రవి కిరణ్, ఓబీసీ సెల్ చైర్మన్ దొంగరి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి



సమ్మక్క (ఫైల్)

ఖిలా వరంగల్: వరంగల్ 40వ డివిజన్ ఉర్సు కరీమాబాద్ దర్గా ప్రాంతానికి చెందిన శతాధిక వృద్ధురాలు బేతి సమ్మక్క (103) ఆదివారం మృతి చెందారు. ఆమెకు ఐదుగురు కొడుకులు, ముగ్గురు కుమార్తెలు కాగా, 50 మంది మనవళ్లు, మనవరాళ్లతో సంపూర్ణ జీవనాన్ని కొనసాగించిన సమ్మక్క.. ఇటీవల అనారోగ్యం పాలై ఆదివారం ఉదయం కన్నుమూశారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



ఖిలా వరంగల్: కరీమాబాద్ ఉర్సు దర్గాలో మీనేస్తం హెల్పింగ్ సొసైటీ అధ్యక్షుడు ఆకులపల్లి యాకోబు ఆధ్వర్యంలో సన్‌లైఫ్ ఆస్పత్రి డాక్టర్ అనంతుల అన్వేష్, సూర్య పిల్లల క్రిటికల్ కేర్ ఆస్పత్రి డాక్టర్ జడల హరీష్‌వర్ధన్ నేతృత్వంలో ఉర్సు దర్గా పీఠాధిపతి హజ్రత్ ఉబేద్ బాబా సహకారంతో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరానికి స్థానికుల నుంచి అపూర్వ స్పందన వచ్చిందని ఉబేద్‌బాబా తెలిపారు.

ఎఫ్‌పీఓలో సభ్యత్వం ఉండాలి



హసన్‌పర్తి: ప్రతీరైతు ఎఫ్‌పీఓ (రైతు ఉత్పత్తిదారుల సంఘం)లో సభ్యత్వం పొందాలని పీఏసీఎస్ చైర్మన్ మేర్గు రాజేష్‌గౌడ్ సూచించారు. హసన్‌పర్తి మండలం వంగపహాడ్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలోని బైరాన్‌పల్లిలో రైతు ఉత్పత్తిదారుల సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ఉత్పత్తులను సమష్టిగా విక్రయించడం ద్వారా కొనుగోలుదారులు, ప్రభుత్వ సంస్థల ద్వారా మెరుగైన ఆదాయాన్ని సమకూర్చుకోవచ్చని వివరించారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ జనార్దన్ రెడ్డి, సీఈఓ పరమేష్, ముల్కలపల్లి మహేష్, గండు రమేష్, సిలివేరు పాల్గొన్నారు.

కుక్కలు, కోతులతో జనం బెంబేలు



గుంపులుగా సంచరిస్తున్న కోతులు



మండల కేంద్రంలో స్వైరవిహారం చేస్తున్న పందులు

- పందుల స్వైరవిహారం
- కంపు కొడుతున్న పలు వీధులు
- దాడులు చేసి గాయపరుస్తున్న కుక్కలు, కోతులు
- పట్టించుకోని అధికారులు

ఎల్కతుర్తి : మండల కేంద్రంలో కోతులు, కుక్కలు, పందులు స్వైర విహారం చేస్తున్నాయి. పదుల సంఖ్య నుంచి వందల సంఖ్యకు చేరుకోవడంతో గ్రామస్తులు బెంబేలెత్తిపోతున్నారు.

హడలెత్తిస్తున్న కుక్కలు

ప్రధాన రహదారిపై కుక్కలు గుంపులుగా తిరుగుతూ వాహనాదారులపై ఎగబడుతున్నాయి. ఇటీవల ఓ పిచ్చికుక్క ఆరుగురిపై విచక్షణ రహితంగా దాడిచేసి గాయపర్చింది. గాయపడిన వారు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రితో పాటు వరంగల్‌లోని ఎంజీఎంలో చికిత్స పొందారు.

బాబోయ్ కోతులు

ఏ వీధిలో చూసినా కొతుల గుంపే కనబడుతోంది. ఇళ్లలోకి చొరబడి ఆహార పదర్థాలు, నిత్యవసర వస్తువులు ఎత్తుకెళ్లి స్థానికులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. అంతే కాకుండా వృద్ధులు, గృహిణులపై దాడిచేసి గాయపరుస్తున్నాయి. దీంతో వీధుల్లో నడవాలంటే పిల్లలు, పెద్దలు జంకుతున్నారు. కర్రలు పట్టుకుని బయటకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో గ్రామంలోని పలు వీధులు బురదమయంగా మారాయి. దీనికి తోడు పందులు సంచరిస్తూ స్వైరవిహారం చేస్తున్నాయని, అంటు వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికే దోమలు, ఈగలు వ్యాప్తిచెంది పలువురు జ్వరాల బారిన పడ్డారని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి కుక్కల, పందుల, కోతుల బెడద నుంచి కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.



గుంపులుగా సంచరిస్తున్న కుక్కలు

వెంకటేశ్వరరావు ఆశయాలను కొనసాగించాలి



మాట్లాడుతున్న వెంకటాద్రి

వేలేరు : దేవులపల్లి వెంకటేశ్వర రావు, తరిమెల నాగిరెడ్డి ఆశయాలను కొనసాగించాలని గ్రామీణ పేదల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నెబోయిన వెంకటాద్రి పిలుపునిచ్చారు. మండలంలోని కన్నారం గ్రామంలో భారత కమ్యూనిస్టు విప్లవకారుల సమైఖ్యతా కేంద్రం ఆధ్వర్యంలో దేవులపల్లి వెంకటేశ్వరరావు, నాగిరెడ్డి, విజయ్‌శర్మ సంస్మరణ సభను టీపీడీఆర్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లు గడుస్తున్నా పేదలు సమస్యలపై పోరాడుతూనే ఉన్నారని అన్నారు. వారిపై ప్రభుత్వాల నిర్బంధం కొనసాగుతూనే ఉందన్నారు. ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు పోరాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. విప్లవోద్యమంలో అనేకమంది ప్రాణాలను పణంగా పెట్టి పేదప్రజల కోసం పోరాడారని గుర్తుచేశారు. అదే విధంగా పేదలు పోడు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ పేదల సంఘం అధ్యక్షుడు మార్క వెంకన్న, పొన్నాల సమ్మయ్య, ప్రధాన కార్యదర్శి వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీకి తరలిన పోస్టల్ పెన్షనర్స్ సంఘం నాయకులు



ఢిల్లీకి బయల్దేరుతున్న సంఘం నాయకులు

కాజీపేట రూరల్: తమ సమస్యల పరిష్కారానికి భారతీయ పోస్టల్ పెన్షనర్స్ సంఘ్, పోస్టల్ అండ్ ఆర్ఎంఎస్ పెన్షనర్స్ సంఘం నాయకులు కాజీపేట జంక్షన్ నుంచి తెలంగాణ ఎక్స్‌ప్రెస్‌లో ఢిల్లీకి ఆదివారం తరలివెళ్లారు. సీజీహెచ్ఎస్ స్కీంలో పేర్కొన్న పెన్షనర్స్ వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటుపై కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి, అధికారులను కలిసి వినతి పత్రం ఇవ్వనున్నట్లు వారు తెలిపారు. 8వ పే కమిషన్‌లో గ్రామీణ తపాలా ఉద్యోగులను చేర్చాలని, కమలేష్ చంద్ర కమిటీ సిఫార్సులను వెంటనే అమలు చేయాలని సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేయనున్నట్లు పేర్కొన్నారు. ఢిల్లీకి తరలివెళ్లిన వారిలో గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షుడు బి.వెంకటేశ్వర్లు, కేంద్ర ప్రభుత్వ పెన్షనర్స్ సంఘం నాయకులు ఎస్.సదానందం, చాడా జైహింద్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, కక్కెర్ల సాంబయ్య, లింగారెడ్డి, తదితరులు ఉన్నారు.

రాకపోకలకు అంతరాయం



తాత్కాలిక వంతెన పైనుంచి ప్రవహిస్తున్న వరద

నడికూడ : మండలంలో ఇటీవల కురుస్తున్న వర్షాలకు కంఠాత్మకూరు వాగుపై వరద ఉధృతంగా ప్రవహిస్తోంది. బ్రిడ్జి నిర్మాణంలో భాగంగా రోడ్డు డైవర్షన్ కోసం తాత్కాలికంగా నిర్మించిన వంతెనపై నుంచి వరద ప్రవహిస్తుండటంతో పరకాల–అంబాల నుంచి హనమకొండకు వెళ్లేందుకు అంతరాయం ఏర్పడింది. దీంతో బస్సులు నడికూడ, శనిగరం, మాదన్నపేట, గూనిపర్తి, అంబాల మీదుగా వెళ్లాల్సి వచ్చింది. కాగా వాగు వద్దకు వాహనాలు రాకుండా ఆదివారం ఉదయం దామెర పోలీస్‌లు బారికేడ్లు ఏర్పాటు చేశారు. వరద ఉధృతి కారణంగా చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలి



మాట్లాడుతున్న కుమారస్వామి

హన్మకొండ చౌరస్తా: దేశవ్యాప్తంగా కులగణన చేపట్టి పార్లమెంట్‌లో కేంద్రం ఆమోదించాలని దళిత నిరుద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల కుమారస్వామి డిమాండ్ చేశారు. హనుమకొండలోని పబ్లిక్‌గార్డెన్‌లో సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర రెండో రాజధానిగా పేర్కొంటున్న వరంగల్‌ను ఆరు జిల్లాలుగా విభజించి గత పాలకులు అభివృద్ధిని అడ్డుకున్నారని ఎద్దేవాచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి హనుమకొండ, వరంగల్‌ను ఒకే జిల్లాగా ప్రకటించాలని కోరారు. మామునూరు విమానాశ్రయానికి రూ.205 కోట్లు కేటాయించిన సీఎం రేవంత్‌రెడ్డి చొరవ చూపి డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ ఎయిర్‌పోర్టుగా నామకరణం చేయాలని సూచించారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ల బిల్లుకు గవర్నర్ ఆమోదం తెలపాలని విజ్ఞప్తి చేశారు.

సంక్షిప్తంగా

ఆలయ కమిటీ ఎన్నిక



ధర్మసాగర్ : మండలంలోని ముప్పారం గ్రామంలో గల శ్రీముఖ్యనాథ స్వామి దేవాలయ నూతన పాలకవర్గాన్ని వ్యవస్థాపక అధ్యక్షుడు శివసాని ప్రవీణ్ రవీంద్ర అధ్యక్షతన ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొన్నే రవీందర్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా మోడెం రవి, ఎర్ర చేరాలు, ప్రధాన కార్యదర్శిగా గుంటిపల్లి సంపత్ కుమార్, కోశాధికారిగా కుంభం నగేష్, సహా కార్యదర్శులుగా అన్నంపెద్ద అశోక్, మత్రిపల్లి రాజు, డైరెక్టర్లుగా సాయిలు, ఇస్తారి, వెంకటేశ్, జయచందర్, రామకృష్ణ, నవీన్, చందర్, కిరణ్, శ్యామ్, నగేష్ ప్రమాణస్వీకారం చేశారు. దేవస్థానం ట్రస్ట్ చైర్మన్ ప్రవీణ్, కో ఆప్షన్ సభ్యులు శ్రీనివాస్, సురేష్, రామస్వామి, రాజయ్య, కొమురయ్య పాల్గొన్నారు.

కేటీఆర్‌కు ఘన స్వాగతం



కార్యకర్తలతో కరచాలనం చేస్తున్న కేటీఆర్

శాయంపేట : భూపాలపల్లి నియోజకవర్గ పర్యటనకు వెళ్తున్న మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావుకు మండలంలోని మాందారిపేట స్టేజీ వద్ద భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, మాజీ జెడ్పీ చైర్ పర్సన్ గండ్ర జ్యోతి ఘన స్వాగతం పలికారు. కేటీఆర్‌ను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించారు. పార్టీ మండల అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ తిరుపతిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ గ్రామకమిటీ ఎన్నిక

శాయంపేట : మండలంలోని గోవిందాపూర్ గ్రామంలో ఆదివారం బీఆర్ఎస్ పార్టీ గ్రామ కమిటీని ఆ పార్టీ మండల అధ్యక్షుడు గంగుల మనోహర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నర్ర రాజు, ప్రధాన కార్యదర్శిగా బూర సత్యనారాయణ, బీసీ సెల్ అధ్యక్షుడిగా బొడ్డు సంతోష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

అభినందనలు



డాక్టర్ రవిని సన్మానిస్తున్న నాయకులు

నడికూడ : మండలంలోని నర్సక్కపల్లి గ్రామానికి చెందిన డాక్టర్ పసుల రవి ఇటీవల హనుమకొండలోని టీబీ ఆస్పత్రి సూపరింటెండెంట్ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఆదివారం ఆయకు పలువురు అభినందనలు తెలిపారు. మండల కేంద్రానికి చెందిన ఆరె సంఘం నాయకుడు, ఆర్ఎంపీ లోకేటి నగేష్, ప్రతాప్ పూలబొకే అందించి శాలువాతో ఘనంగా సత్కరించారు.

బేబీ ఫీడింగ్ సెంటర్ ఏర్పాటు

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్‌లో ఏర్పాటు చేసిన బేబీ ఫీడింగ్ సెంటర్‌ను పిల్లల తల్లులు సద్వినియోగం చేసుకోవాలని రోటరీ క్లబ్ హనుమకొండ జిల్లా 3150 పూర్వ గవర్నర్ డాక్టర్ శరత్ బాబు సూచించారు. కాజీపేట జంక్షన్‌లోని వెయింట్ హాల్‌లో ఏర్పాటు చేసిన బేబీ ఫీడింగ్ సెంటర్‌ను ఆయన ఆదివారం ప్రారంభించి మాట్లాడారు. మాతృ, శిశు ఆరోగ్యంపై ప్రత్యేక చొరవతో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో బేబీ ఫీడింగ్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు వివరించారు. కాజీపేట ఛీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ అరుణ్‌శౌరి, రైల్వే స్టేషన్ మేనేజర్ అగ్గి రవీందర్, క్లబ్ ప్రెసిడెంట్ బేతి రవీందర్‌రెడ్డి, సెక్రటరీ గంగోజుల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

‘రుద్రమ విగ్రహాన్ని కవిత తాకడం సిగ్గుచేటు’

రామన్నపేట: లిక్కర్‌స్కామ్‌లో కూరుకుపోయిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత.. తెలంగాణ వీరనారి రాణి రుద్రమదేవి విగ్రహానికి పూలమాల వేయడం తెలంగాణ సమాజానికే అవమానకరమని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ ధ్వజమెత్తారు. ఈ మేరకు పోచమ్మమైదాన్‌లోని రాణి రుద్రమదేవి విగ్రహానికి ఆదివారం క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మహిళా, యువజన మోర్చా, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

భూ భారతి ఫిర్యాదులను పరిష్కరించాలి

- జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి



భూ భారతి దరఖాస్తులు పరిశీలిస్తున్న వెంకట్‌రెడ్డి

కమలాపూర్ : భూ భారతిలో స్వీకరించిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని ఆదివారం ఆయన సందర్శించి భూ భారతి దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలించారు. భూ భారతి దరఖాస్తుల ఆన్‌లైన్ పూర్తికాగానే సంబంధిత రైతులకు నోటీసులు జారీ చేసి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్ఐలు సమ్మయ్య, శ్రీనివాస్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

వైద్యానికి ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి వైద్యసిబ్బందిని ఆదేశించారు. మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆదివారం ఆయన ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఓపీ సేవలు, ఆస్పత్రికి సంబంధించిన పలు రికార్డులు పరిశీలించారు. ఆస్పత్రిలో అందిస్తున్న వైద్యసేవలపై వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఇన్ పేషెంట్లతో మాట్లాడి సదుపాయాల గురించి తెలుసుకున్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని, సీజనల్ వ్యాధులు, వాటి నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యుడు డాక్టర్ వరుణ్‌మాధవ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సెప్టెంబర్‌లోపు అందుబాటులోకి ఆర్వోబీ

- బీజేపీ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి



అధికారులతో మాట్లాడుతున్న కృష్ణారెడ్డి

కమలాపూర్ : ఉప్పల్‌లో ఈఏడాది సెప్టెంబర్‌లోపు ఆర్వోబీ పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని బీజేపీ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి వెల్లడించారు. ఉప్పల్ ఆర్వోబీపై అమరుస్తున్న గడ్డర్ల పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైల్వే అధికారులతో మాట్లాడి ఆర్వోబీ పనులు ఎప్పటి వరకు పూర్తి చేస్తారనే విషయంపై ఆరా తీశారు. అనంతరం కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర మంత్రి బండి సంజయ్ చొరవతో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న ఉప్పల్ ఆర్వోబీ పనులకు మోక్షం కలిగిందన్నారు. ఆర్వోబీ కీలక ఘట్టమైన గడ్డర్ల బిగింపు పనులే అత్యంత ముఖ్యమైనవన్నారు. ఈ గడ్డర్లు బిగించాలంటే రైళ్ల రాకపోకలను సుమారు 3 గంటల నుంచి 6 గంటల వరకు నిలిపివేయాల్సి ఉంటుందన్నారు. బండి సంజయ్ ఆదేశాల మేరకు ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఆర్వోబీ పనులు పూర్తి చేయడానికి రైల్వే అధికారుల చర్యలు చేపట్టారన్నారు. ప్రస్తుతం ఆర్వోబీ పనులు శరవేగంగా జరుగుతున్నాయని, సెప్టెంబర్‌లోగా ఆర్వోబీని పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని రైల్వే అధికారులు వెల్లడించినట్లు ఆయన తెలిపారు. ఆయనతో పాటు బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు రాజేందర్, అశోక్‌రెడ్డి, భూపతి ప్రవీణ్, తుమ్మ శోభన్‌బాబు, బోగి భిక్షపతి, రావుల ఆకాష్, చిట్టి సుందరయ్య, ర్యాకం సుధాకర్, రవి, మొగిలి, వంశీ, రాజు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై ట్రాఫిక్ జామ్



జాతీయ రహదారిపై నిలిచిన వాహనాలు

దామెర : హైదరాబాద్–భూపాలపట్నం 163 జాతీయ రహదారిపై ఆదివారం భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. మండలంలోని ఊరుగొండ సమీపంలో జాతీయ రహదారిలో గల ఎస్సారెస్పీ కెనాల్‌పై బ్రిడ్జి పనులు కొనసాగుతున్నాయి. అయితే రాకపోకలు కొనసాగించేందుకు బ్రిడ్జిపై తాత్కాలిక దారి నిర్మించారు. అయితే డైవర్షన్ రోడ్డుపై లారీ బ్రేక్‌డౌన్ అవడంతో కిలో మీటర్‌మేర వాహనాలు సుమారుగా గంటకు పైగా నిలవడంతో ట్రాఫిక్ జామ్ అయ్యింది. గంటపాటు నిరీక్షించిన వాహనదారులు విసిగిపోయారు. విషయం తెలుసుకున్న స్థానిక పోలీస్‌లు వెటనే అక్కడకు చేరుకుని ట్రాఫిక్ క్లియర్ చేశారు.

గుంత పూడ్చివేత



సాక్షి ఎఫెక్ట్..

నడికూడ : మండలంలోని కంఠాత్మకూరు హనుమాన్‌గుడి మలుపు వద్ద వర్షాలకు గుంత ఏర్పడి ప్రమాదకరంగా మారింది. దీంతో ఆదివారం సాక్షి దినపత్రికలో ‘ప్రమాదకరంగా గుంత’ అనే కథనం ప్రచురితమైంది. ఆర్ అండ్‌బీ అధికారులు స్పందించి గుంతను పూడ్చివేశారు. స్థానికులు సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

పీఏసీఎస్‌ను తరలిస్తాం

మండలంలోని రైతులకు పీఏసీఎస్ సేవలు అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సాక్షి దినపత్రికలో శనివారం ‘రైతులకు సేవలందేనా’ అనే కథనం ప్రచురితమైంది. కాగా మాదారం పీఏసీఎస్ చైర్మన్ లింగమూర్తి స్పందించారు. పరకాల నుంచి నడికూడ మండల కేంద్రానికి త్వరలో సొసైటీ బ్యాంక్‌ను తరలిస్తామని తెలిపారు.

జల్సాలకు అలవాటు పడి బైక్‌ల చోరీ

- నిందితుల అరెస్ట్



నిందితుల అరెస్టు చూపుతున్న సీఐ రాజగోపాల్, ఎస్సై శ్రీనివాస్

ఐనవోలు : మండల కేంద్రంలోని మల్లికార్జునస్వామి జాతరలో సంక్రాంతి రోజు ద్విచక్ర వాహనాలు దొంగతనం చేసిన నిందితులను పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. పర్వతగిరి సీఐ రాజగోపాల్, ఎస్సై శ్రీనివాస్ ఆదివారం వివరాలు వెల్లడించారు. వరంగల్‌లోని పడమర కోటకు చెందిన జి.రోహిత్, బి.కార్తీక్, ఎం.హర్షిత్ ముగ్గురు స్నేహితులు. జల్సాలకు అలవాటు పడి జాతరలో ద్విచక్ర వాహనాలు దొంగతనం చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో సంక్రాంతి రోజు రాత్రి ఐనవోలు జాతర సందర్భంగా అంగడి ప్రాంతంలో పార్క్ చేసి ఉన్న మూడు బైక్‌లను దొంగతనం చేసి తీసుకెళ్లారు. అందులో ఒక బైక్‌ను విక్రయించి, వచ్చిన డబ్బులతో ముగ్గురు జల్సాలు చేసుకున్నారు. మిగతా రెండు బైక్‌లను వాడుకుంటున్నారు. కాగా ఈ ద్విచక్ర వాహనాలపై ముగ్గురు పున్నేలు క్రాస్ రోడ్ నుంచి వర్ధన్నపేటకు వెళ్తున్నారు. ఈ క్రమంలో పోలీసులు వాహనాల తనిఖీ చేస్తుండగా గమనించి పారిపోయేందుకు యత్నించారు. అనుమానం వచ్చి వెంబడించి వారిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. అనంతరం విచారించగా బైక్‌లు చోరీ చేసినట్లు అంగీకరించడంతో బైక్‌లు, మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు పేర్కొన్నారు.

నేడు కేజీబీవీలో ఇంటర్ స్పాట్ అడ్మిషన్లు

సంగెం : నేడు (సోమవారం) మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ గురుకుల విద్యాలయ (కేజీబీవీ)లోని జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో స్పాట్ ప్రవేశాలు కల్పించనున్నట్లు ప్రత్యేక అధికారి నీలిమ తెలిపారు. మండలంలోని విద్యార్థినులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి కృషి

- వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు

హసన్‌పర్తి: 66వ డివిజన్‌లోని కాకతీయ వెంటేజ్, బీకేఆర్ ఎన్‌క్లేవ్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు హామీ ఇచ్చారు. కాతీయ వెంటేజ్, బీకేఆర్ ఎన్‌క్లేవ్ కుడా లేఅవుట్ కాలనీలను ఎమ్మెల్యే ఆదివారం రాత్రి సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదని, వీధి దీపాలు వెలగడం లేదని ఎమ్మెల్యే దృష్టికి స్థానికులు తీసుకెళ్లారు. పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో టీపీసీసీ లీగల్ వైస్ చైర్మన్ నిమ్మా శేఖర్‌రావు, డివిజన్ అధ్యక్షుడు కనపర్తి కిరణ్, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు వెంకటేశ్వర్లు, ఎస్ఎస్‌యూఐ జిల్లా మాజీ అధ్యక్షుడు వీసం సురేందర్ రెడ్డి, దేవస్థాన చైర్మన్ ఆరెల్లి వెంకటస్వామి, మాజీ ఉపసర్పంచ్ బల్సుకూరి శ్రీనివాస్, మాజీ వార్డు సభ్యుడు పోతరాజు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.